క్లుప్తంగా

నేడు తైబజారు వేలం

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో తైబజారు వేలం గురువారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక సంవత్సరానికి సంబంధించి వేలం పాటను ఎంపీడీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

నాగప్పకు పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామానికి చెందిన, కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు జెన్నె నాగప్పను వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. గత కొన్ని రోజుల క్రితం నాగప్పకు గుండె సంబంధించిన శస్త్ర చికిత్స చేశారు. బుధవారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు రాజప్పగౌడ్, మాజీ ఎంపీటీసీ గొడి వెంకటేశం, నాయకులు శ్యాంరెడ్డి ,శ్రీనివాస్‌రెడ్డిలు గౌతపూర్‌కు వెళ్లి నాగప్పను పరామర్శించారు.

షార్ట్ సర్క్యూట్‌తో బేకరీలో మంటలు

రూ.లక్ష మేర ఆస్తినష్టం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్ : షార్ట్ సర్క్యూట్‌తో ఓ బేకరీలో మంటలు అంటుకున్నాయి. సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటన బుధవారం ఉదయం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని కేక్ వరల్డ్‌లో మంటలు, పొగ వ్యాపించడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో బేకరీలోని కేకులు, ఐస్‌క్రీమ్‌లు పెట్టే డీప్ ఫ్రిడ్జిలు షార్ట్ సర్క్యూట్‌కు గురైనట్లు గుర్తించారు. సుమారు రూ. లక్ష మేరకు ఆస్తినష్టం జరిగినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పక్కనే ఉన్న దుకాణాలకు, నివాస ప్రాంతాలకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదు.

ఉపాధ్యాయులకు సన్మానం



కొత్త ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చి విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, వసంత, రాధిక, మమతలను గ్రామస్తులు బుధవారం స్వాగతం పలికి మొక్కను అందించి శాలువతో సన్మానించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామని ఉపాధ్యాయినీలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రావన్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, కవయిత్రి కళావేదిక ఫౌండర్ అధ్యక్షుడు వెంకటయ్య, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ మంజుల, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఏసు విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

దోమ: ప్రతి ఒక్కరూ పోలీసు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఏఎస్ఐ సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోలీసు చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి తీవ్ర ఇబ్బందికర పరిస్థితి నెలకొంటుందన్నారు. మితిమీరిన వేగం వల్ల తాము నష్టపోవడంతో పాటు ఇతరుల ప్రాణాలకు సైతం హానికరంగా మారుతున్న పరిస్థితి ఏర్పడుతోందన్నారు.

పల్లెల్లో గట్టు పంచాయితీలు!



దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం

- భూమి ధరలు పెరగడమే కారణం
- పెండింగ్‌లో భూమి కొలతలు
- ఇబ్బంది పడుతున్న భూ యజమానులు

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన ఓ రైతు గతేడాది నవంబర్‌లో భూమి కొలత కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 45 రోజులలోపు సర్వేయర్ భూమి కొలతలు చేపట్టాలి. కాని, ఇప్పటివరకు సర్వే కాలేదు. ఇలా మండలంలోని చాలా గ్రామాల్లో సర్వే చేయకపోవడంతో భూముల వద్ద గట్టు పంచాయితీలు నడుస్తున్నాయి. భూకొలతలకు శాశ్వత సర్వేయర్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా ఇన్‌చార్జి సర్వేయర్‌లే కొనసాగుతుండటంతో కొలతలు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలో 33 పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 46వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 21500 మంది రైతులు ఉన్నట్లు అధికారుల లెక్కలు. వ్యవసాయ ఆధారిత మండలం కావడంతో ఇక్కడ భూముల రేట్లు అమాంతం పెరిగాయి. దీంతో ఎకరం భూమి రూ.50నుంచి రూ.80లక్షల వరకు పలుకుతుంది.

ఇన్‌చార్జి సర్వేయర్‌తో ఇబ్బందులు..

మండల సర్వేయర్ మురళీధర్ కొడంగల్, దౌల్తాబాద్ మండలాలకు విధులు నిర్వహిస్తున్నారు. అదనపు బాధ్యతలు కూడా అప్పగిస్తున్నారు. ఇన్‌చార్జి సర్వేయర్‌తో రైతులు భూకొలతలు కాక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రైతులు ప్రైవేట్ సర్వేయర్‌తో వేల రూపాయలు డబ్బులు ఖర్చు పెట్టి కొలతలు చేసుకుంటున్నారు. ఒక్కో రైతు మీసేవలో పదులసార్లు దరఖాస్తు చేసుకున్న భూమి కొలిచే నాథుడు లేకపోవడంతో గట్టు పంచాయితీలు పెరిగిపోతున్నాయి. గుంట, అరగుంట కోసం రైతులు గొడవలు పెట్టుకుంటున్నారు.

పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్న రైతులు

సర్వేయర్ లేకపోవడంతో రైతుల మధ్య గొడవలు పెరిగి పోలీస్‌స్టేషన్ వరకు చేరుతున్నాయి. దీంతో భూముల పంచాయితీ పోలీసులకు తలనొప్పిగా మారింది. ఒక్కో సర్వేయర్‌కు రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు ఉండడంతో పాటు ఇతర కొలతలు అప్పగిస్తుండడంతో వారికి పనిభారం ఎక్కువైంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మండలానికి శాశ్వత సర్వేయర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



శాశ్వత సర్వేయర్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూసమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇక్కడున్న సర్వేయర్‌కి రెండు మండలాల బాధ్యతలు ఉండడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించి రైతుల సమస్యలు తీర్చాలి.

– జనార్దన్‌రెడ్డి, నందారం

ఘనంగా వీడ్కోలు సమావేశం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన ప్రమోషన్లు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సమావేశం జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను శాలు వా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, వీరేశం, నసీం సుల్తానా, పద్మ, శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతి, సుహాసిని, అనురాధ, రమాదేవి, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేద దళితులకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్, స్ఫూర్తి డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసిన 60 మంది ఎస్సీ మహిళలకు బుధవారం ఆయన మిషన్లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాత తాండూరులోని అంబేడ్కర్ పార్క్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 20వ వార్డులో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజస్, స్ఫూర్తి డెవలప్‌మెంట్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సంగీతాఠాకూర్, నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



తిరుచ్చి ఉత్సవంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ 54వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను వజ్ర వైఢ్యూర్యాలు, విశేష పూల అలంకరణలతో స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న శ్రీవర్ధన్, 5వ తరగతి చదువుతున్న అర్జున్‌లు రాష్ట్రస్థాయిలో 5వ, 6వ ర్యాంకులు సాధించారు. సెమ్స్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో రాష్ట్రస్థాయిలో 5, 6వ ర్యాంకులు సాధించడంతో బుధవారం నగరంలోని రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించారు. మునుముందు విద్యార్థులు పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, మన ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

6న హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్ రూరల్ : పట్టణశివారులోని సిద్ధనొంపు అంజనేయ స్వామివారి దేవాలయంలో శనివారం నిర్వహించనున్న హనుమాన్ చాలీసాను విజయవంతం చేయాలని హిందూవాహిని, ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యులు కోరారు. వారు మాట్లాడుతూ .. ప్రతీ శనివారం సిద్ధనొంపు ఆలయ ఆవరణలో హనుమాన్ చాలీసా పారాయణం చేసే వారమన్నారు. ఈ శనివారం 41వ వారం పురస్కరించుకొని ఉ.9గంటల నుంచి 54పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, ఆంజనేయస్వామి వారికి అభిషేకంతో పూజలు చేయనున్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

బొంరాస్‌పేట: మండలంలో నూతన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు నేడు శ్రీకారం చుట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు గౌడ్ తెలిపారు. మండలంలోని జానకంపల్లి నుంచి మహంతీపూర్ మీదుగా యాలాల మండలం దేవనూరుకు రూ.23 కోట్ల నిధులతో బీటీరోడ్డు, కాగ్నావాగుపై వంతెన అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు సరికాదు

బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

మర్పల్లి: పార్లమెంట్ సమావేశంలో ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ హిందుత్వంపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాయం నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ర్యాలీగా తీసుకెళ్లి బస్టాండ్ చౌరస్తాలో దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని అగౌరపరిచేలా రాహుల్ చేసి వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, భేషరుతుగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు సుభాష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సీహెచ్ మధుకర్, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి ఉన్నారు.

నిందితులను శిక్షించాలి

దోమ: యూపీలో మత కార్యక్రమం నిర్వహించి 116మంది మృతి చెందడానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు అంజిరావణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బోలేబాబా దర్శనం కోసం అంతమందిని ఒకే దగ్గర ఉంచడం అక్కడ ఉన్న మట్టిని సేకరించే పరిస్థితిని తీసుకురావడం వంటి ఇబ్బందికర పరిస్థితికి కారణమైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

ఆహార పదార్థాలను నిల్వ ఉంచొద్దు

కొడంగల్ : మున్సిపల్ పరిధిలోని హోటల్స్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరి షాప్స్, పానీపూరి బండ్లు, ఇతర ఆహార సంబంధిత దుకాణాల యజమానులు ఆహార పదార్థాలను నిల్వ ఉంచరాదని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయా దుకాణాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తినుబండారాలను ఎప్పటికప్పుడు తయారు చేసి విక్రయించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పద్ధాలు తయారు చేసే వారు, విక్రయించేవారు, సరఫరా చేసే వారు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకొని ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు చూపించాలన్నారు. కుళ్లిపోయిన ఆహార పదార్థాలను నిల్వ ఉంచినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎటువంటి నోటీస్ లేకుండా హోటళ్లను సీజ్ చేస్తా మని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. శుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు.

సాగు చేసే ప్రతి రైతుకు భరోసా

పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

మోమిన్‌పేట: సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని మెజార్టీ రైతులు కోరారని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం మోమిన్‌పేట, మేకవనంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఎన్ని ఎకరాలు ఉన్నా 10ఎకరాల లోపు సాగుకు భరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయ పడినట్లు తెలిపారు. ఎక్కువగా ఫాం ల్యాండులు, వెంచర్‌లకు అనర్హులైన వారికి రైతుబంధు అందినట్లు చెప్పారు. మే నెల చివరి వారంలో రైతు భరోసా నిధులను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. ఉద్యోగుల, ఆదాయం పన్ను చెల్లిస్తున్న వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు, ప్రజాప్రతినిధులకు రైతు భరోసా కల్పించొద్దన్నారు. అలాగే, యంత్ర పనిముట్లు, డ్రిప్, తుంపర సేద్యపు పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడు, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, ఏఓ జయవంకర్, ఏఈఓలు పెంటయ్య, చంద్రిక, సీఈఓలు శేఖర్, బాలకిష్టయ్య, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ప్రత్యేక అధికారి దానయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి దానయ్య

దుద్యాల్: వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుద్యాల్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి దానయ్య పేర్కొన్నారు. బుధవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఆయనా మాట్లాడారు. గ్రామంలోని అన్ని వీధుల్లో చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమష్టిగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు నివసిస్తున్న ఆవాసాల మధ్య ఎలాంటి మురుగు నీరు పారకుండా పంచాయతీ కార్మికులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్, విద్యుత్ లైన్‌మెన్ కరీం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, మాజీ సర్పంచ్ ఎండీ ఖాజా, మాజీఎంపీపీ మేర్గు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీని కలిసిన నాయకులు



జయప్రద్రను సన్మానిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: రాష్ట్ర ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయప్రదను బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం సొంత నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పడి.. ఏడాది గడుస్తున్నా నేటికీ అధ్యాపకుల పోస్టులు మంజూరు కాలేదని, అలాగే సొంత భవనం లేదని తెలిపారు. సొంత భవన నిర్మాణం కోసం స్థలం కూడా సేకరించామని స్థానిక నాయకులు ఆర్‌జేడీకి వివరించారు. ఇందుకు ఆమె స్పందిస్తూ త్వరలో కళాశాలలో అధ్యాపకుల పోస్టులు, భవన నిర్మాణం కోసం ఆర్థిక శాఖకు నివేదిక పంపామని వెంటనే పోస్టులతో పాటు భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వనున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రావు, వీరన్న, కృష్ణ తదితరులున్నారు.



కుల్కచర్ల: ఎంపీటీసీలకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తాండూరు రూరల్: వైస్ ఎంపీపీ స్వరూప వెంకట్రామిరెడ్డిలను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ నాగార్జున, నాయకులు వీరేందర్‌రెడ్డి, తదితరులు

ప్రజా సేవ అదృష్టం

ప్రజాప్రతినిధులుగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం. ఐదేళ్లు మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశామని ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీ లు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ పదవి కాలం గురువారంతో ముగియనుండటంతో అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రజలకు అందు బాటులో ఉండి సేవ చేస్తే మళ్లీ గెలిపిస్తా రని పలువురు నాయకులు పేర్కొన్నారు.



మర్పల్లి: ఎంపీపీ లలిత, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, సూపరింటెండెంట్ కృష్ణరావు, ఆయాశాఖల అధికారులు



నవాబుపేట: ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు



దౌల్తాబాద్: వీడ్కోలు పొందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీ



యాలాల: మాజీ ప్రజాప్రతినిధులతో బాలేశ్వర్‌గుప్తా తదితరులు